క్లుప్తంగా

వేడుకగా శ్రీరామ కల్యాణం



శ్రీరామకల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: నగరంలోని రింగురోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న మహా సామ్రాజ్య పట్టాభిషేకంలో భాగంగా శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం రామాయణ పారాయణం, నక్షత్ర హోమం చేశారు. అనంతరం సుందరకాండ పారాయణం చేశారు. మధ్యాహ్నం వేడుకగా శ్రీరామ కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసా సేవా సంఘ అధ్యక్షుడు పిళ్లా విజయ్‌కుమార్, కార్యదర్శి చెరుకూరి శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎమ్మెల్యే కోలగట్లను సత్కరిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం కమిటీ నూతన కార్యవర్గం

విజయనగరం టౌన్: నగరంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా రెడ్డి శంకరరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదేశాల మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నామన్నారు. సభ్యులుగా శోభారాణి, మారమ్మ, రమణమ్మ, లక్ష్మి, ప్రసాద్, భీమరాజు ఎంపికయ్యారన్నారు. కమిటీ సభ్యులు, అర్చకుడు సోమశేఖర్‌శర్మ ఎమ్మెల్యే కోలగట్లను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోగులకు రొట్టెల పంపిణీ



రోగులకు రొట్టెలను పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

భోగాపురం: సుందరపేట సమీపంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని రోగులకు శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు శనివారం పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆదేశాల మేరకు ప్రతినెలా 9వ తేదీన సుందరపేట సామాజిక ఆస్పత్రిలోని రోగులు, గర్భిణులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు కాపుగంటి కృష్ణారావు, అట్టాడ సూర్యనారాయణ, సంజీవి, బొల్లు త్రినాథ్, కాపుగంటి భవానీ, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం



నిర్మాణంలో ఉన్న కాలువ

భోగాపురం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ పూడిక సూకరాజు అన్నారు. మండలంలోని ముంజేరు పంచాయతీ మెట్ట సబ్బన్నపేట, గాబువానిపేట గ్రామాల్లో రూ.6 లక్షల ఎంపీపీ నిధులతో నిర్మిస్తున్న కాలువ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల కంటే భిన్నంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతోందని చెప్పారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాణించిన 'సత్య' విద్యార్థులు



హిమాచల్‌ప్రదేశ్ ధర్మశాలలో అందుకుంటున్న విజేతలు

విజయనగరం అర్బన్: హిమాచల్‌ప్రదేశ్ ధర్మశాలలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగిన అంతర్ జోనల్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో పట్టణానికి చెందిన సత్య డిగ్రీ, పీజీ కళాశాల క్రీడాకారిణులు సత్తా చాటారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్. పల్లవి బంగారు, సీహెచ్ శ్రీలక్ష్మి రజత పతకాలు సాధించారని పేర్కొన్నారు. విజేతలను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కోచ్ చల్లా రాము, తదితరులు అభినందించారు.

హామీలన్నీ అమలు చేశాం..

- నగరంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు
- మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తా..
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 10,13 డివిజన్‌లలో రూ.35 లక్షలతో నిర్మించిన రోడ్లు ప్రారంభం



రాజులవీధిలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ చిత్తశుద్ధితో అమలు చేయడంతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యలను కూడా పరిష్కరిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. నగరంలోని 10, 13 డివిజన్‌లలో రూ.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్లతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, 10వ డివిజన్ పరిధిలో గల రాజులవీధిలోను, 13వ డివిజన్‌లో కూరాకుల వీధిలో నూతనంగా రోడ్లు నిర్మించి వినియోగంలోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. గడిచిన 4 సంవత్సరాల 9 నెలల కాలంలో దాదాపు 75 శాతం మేర పనులు పూర్తి చేయగలగామన్నారు. మరోసారి శాసనసభ్యుడిగా గెలిపించితే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్న ఉద్దేశంతో మారుమూల ప్రాంతాలలో సైతం కాలువలు, రహదారులు, విద్యుత్ దీపాలు వంటివి ఏర్పాటు చేశామని చెప్పారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా నిధుల కొరత లేకుండా అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. గతంలో నగరం ఎంతో వెనుకబడిన ప్రాంతంగా ఉండేదని.. చిన్న, చిన్న సమస్యలను కూడా తీర్చలేని దుస్థితిలో పాలకులు ఉండేవారని తెలిపారు. వారానికోసారి మంచినీటిని సరఫరా చేసే పరిస్థితి నుంచి రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసే స్థాయికి చేరుకున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారునాయుడు, జోనల్ ఇన్‌చార్జ్‌లు ముద్దాడ మధు, స్థానిక కార్పొరేటర్లు ఇసరపు రేవతీదేవి, నాయన పద్మ, రామకృష్ణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం

- కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు కార్పొరేషన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు ఆదేశించారు. సచివాలయాలలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన శనివారం పరిశీలించారు. 16, 31వ సచివాలయాలకు చేరుకుని ఏ మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందో కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వివిధ సచివాలయాలలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను స్వయంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ సొంతింటి కల సాకారం చేసే విధంగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిందన్నారు. అదేవిధంగా మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించి లబ్ధిదారులకు పూర్తి హక్కులు కల్పిస్తున్నట్లు చెప్పారు.

నేడు కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



కన్యకాపరమేశ్వరి అమ్మవారు

విజయనగరం: ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ఆదివారం ఐదు గంటలకు సుప్రభాత సేవ, గణపతిపూజ, పుణ్యాహవచనం, పరిషత్తు, పంచగవ్యప్రాసన, నాందీదేవతాహ్వానం, పంచామృతాభిషేకాలు, నారికేళ జలాభిషేకం నిర్వహిస్తామన్నారు. పది గంటల నుంచి అమ్మవారు వజ్రకిరీట స్వర్ణకవచ అలంకరణలో దర్శనమిస్తారన్నారు. వేడుకలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి హాజరవుతారని తెలిపారు. దేవాలయం మేడమీద రవ్వా శ్రీనివాస్ దంపతులచే నిర్మితమైన నూతన అన్నదాన భవనాన్ని కోలగట్ల ప్రారంభిస్తారని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి



భజన కళాకారులను సన్మానిస్తున్న నగర పంచాయతీ వైస్ చైర్మన్ రామారావు, తదితరులు

- నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు

నెల్లిమర్ల రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్మపథం కార్యక్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంలో భజన కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రామ నామాన్ని దశ దిశలా వ్యాప్తి చేయడంలో కళాకారులు ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం రామతీర్థంలో కళారాధన నిర్వహించిన మొయిద గ్రామానికి చెందిన శ్రీరామ భజన బృంద సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థాన బోర్డు మెంబర్ ధవళ నాగ ఇందులక్ష్మి, కళాకారుల సంఘ అధ్యక్షుడు అట్టాడ పైడిరాజు, సిబ్బంది రామారావు, సాయిరామాచార్యులు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆహార నియమాలు పాటించాలి

విజయనగరం: ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటిస్తే ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని శ్రీసాయికృష్ణ వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఏఎస్ ప్రకాశరావు సూచించారు. శనివారం స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న నడక మైదానంలో క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు ఏఎస్ ప్రకాశరావు మాస్టారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పండ్లు, ఆకుకూరలు, ప్రొటీన్, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. రోజూ నడక, వ్యాయామం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ సలహాదారులు ఆరికతోట తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు వల్లూరి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ వై.నలమహారాజు, క్లబ్ కోశాధికారి ఆర్‌సీహెచ్ అప్పలనాయుడు, క్లబ్ సీనియర్ సభ్యులు కోట్ల సత్యనారాయణ, పైడయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



చికిత్స పొందుతున్న వైస్ ఎంపీపీ శంకరరావును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వైస్ ఎంపీపీ శంకరరావును విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకరరావును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరామర్శించి, కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

డెంకాడ: మండలంలోని చింతలవలస ఏపీఎస్పీ బెటాలియన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై 51 మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ధర్మపురి గ్రామానికి చెందిన కె. నర్సింగరావు అనే వ్యక్తిని తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

విజయనగరం అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ డిపో డిస్పెన్సరీ ఆవరణలో శనివారం జరిగిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. రహదారి భద్రతా మాసోత్సవాల నేపథ్యంలో నిర్వహించిన శిబిరాన్ని ఆర్టీసీ ఈడీ రవికుమార్ ప్రారంభించారు. విజయనగరం, ఎస్.కోట డిపోలకు చెందిన ఆర్టీసీ ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్ సొసైటీకి ఇచ్చినట్లు డిపో మేనేజర్ కె. శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీపీటీఓ అప్పలనాయుడు, డీసీఎంఈ కె.శ్రీనివాసరావు, ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా యాగశాల



శాశ్వత యాగశాల

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో నిర్మించిన శాశ్వత యాగశాల ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. గతంలో తాటాకులతో కూడిన తాత్కాలిక యాగశాల ఉండడంతో ఉత్సవాల సమయంలో వాటిని తొలిగించేందుకు దేవస్థాన సిబ్బంది ఇబ్బందులు పడేవారు. ప్రతి ఏటా తాటాకుల కమ్మలతో దేవస్థానంలో యాగశాలను ఏర్పాటు చేసేవారు. శివరాత్రి ఉత్సవాలకు అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తగా తాటాకులను తొలగించేవారు. ఏడాది పొడువునా నిత్య హోమాలు జరగడంతో అగ్ని ప్రమాదాలు జరిగే ప్రమాదం పొంచి ఉండేదని అర్చకులు ఆందోళన వ్యక్తం చేసేవారు. అయితే శాశ్వత యాగశాల నిర్మాణంతో పాటు ఫ్లోరింగ్ నిర్మాణానికి గత ఏడాది ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేయడంతో...ముందుగా యాగశాల పనులు పూర్తి చేశారు. యాగశాలను త్వరలో ప్రారంభించనున్నారు.

గ్రీన్ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతాం..



మొక్క నాటుతున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ వెంకటసుబ్బయ్య

- జేఎన్‌టీయూ జీవీ వీసీ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: యూనివర్సిటీ ప్రాంగణంలో అధిక సంఖ్యలో మొక్కలను పెంచి గ్రీన్ యూనివర్సిటీగా తీర్చిదిద్దుదామని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీసీ బాధ్యతలు తీసుకుని ఏడాది పూర్తయిన నేపథ్యంలో పలు రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యునిసెఫ్ అనుబంధ సంస్థలతో కలసి యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగాలు పని చేసినట్లయితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, డైరెక్టర్లు ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఆర్.గురునాథ్, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల కోఆర్డినేటర్స్ వి.మణికుమార్, డాక్టర్ బొత్స ధర్మారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రమాద రహిత రవాణా అందరి బాధ్యత



పట్టణ వీధుల్లో ఆర్టీసీ సిబ్బంది ర్యాలీ

- జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ

విజయనగరం అర్బన్: ప్రమాద రహిత రవాణా వ్యవస్థ తీసుకురావడానికి ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని శనివారం పట్టణ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో ప్రారంభమైన ర్యాలీ బాలాజీ జంక్షన్, కోట జంక్షన్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి నిబంధనలను వాహనదారులు విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమలో డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోయిన మొబైల్స్ అందజేత



సెల్‌ఫోన్లను చూపిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్న బాధితులతో సైబర్‌సెల్ పోలీసులు

విజయనగరం క్రైమ్: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 40 మొబైల్స్‌ను ట్రేస్ చేసి వాటిని బాధితులకు అందజేశారు. శనివారం స్థానిక సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ వద్ద జరిగిన పంపిణీ కార్యక్రమంలో సైబర్ సెల్ సీఐ టీవీ విజయకుమార్ మాట్లాడుతూ, పోయిన మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు సైబర్ పోలీసులు, సిబ్బంది నిరంతరం పని చేస్తున్నారని చెప్పారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల గురించి ఫిర్యాదు చేసిన కొద్ది రోజుల్లోనే 40 ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్స్‌పై ఫిర్యాదులను సీఈఐఆర్.జీవోవీ.ఇన్ ఆన్‌లైన్ ద్వారా గాని సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో గాని తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్సైలు ప్రశాంత్‌కుమార్, నజీమా బేగం, కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, రాజేష్, నాగమణి, శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా కౌన్సిల్, నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక అమర్‌భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.జోగారావు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ సూరిబాబు, ఆర్థిక కార్యదర్శిగా బి.ఈశ్వరరావు, సంయుక్త అధ్యక్షులుగా ఎస్.చిట్టిబాబు, ఎం.మురళి, ఉపాధ్యక్షులుగా ఎంవీ లక్ష్మీనరసయ్య, ఎ.నాగేశ్వరరావు, డి.సరస్వతి, పి.రాజ్యలక్ష్మి, ఎంఎ స్వామి, అదనపు ప్రధాన కార్యదర్శులుగా పెంకి రాంబాబు, జి.రవి, కార్యదర్శులుగా మరో పది మందిని ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.దేవుడుబాబు వ్యవహరించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణం చేశారు.

108, 104 అంబులెన్సులతో మెరుగైన సేవలు



108, 104 అరబిందో ఎమర్జెన్సీ సంస్థ స్టేట్ హెచ్‌ఆర్ విశ్వనాథ్

విజయనగరం ఫోర్ట్: ప్రజలకు 108, 104 అంబులెన్సులతో మెరుగైన సేవలందిస్తున్నట్టు 108 అరబిందో ఎమెర్జెన్సీ సంస్థ స్టేట్ హెచ్‌ఆర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలోని 108, 104 సంస్థ కార్యాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడే గొప్ప అవకాశం మనకు వచ్చిందని చెప్పారు. విధుల నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అపరసంజీవినిగా 108 అంబులెన్సులను ప్రజలు భావిస్తారని, ఆ నమ్మకానికి తగ్గట్టుగా సిబ్బంది సేవలందించాలన్నారు. ప్రతిరోజు అంబులెన్స్ కండిషన్ బాగుందా లేదా అన్నది చూసుకోవాలన్నారు. నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. 104 వాహనాల ద్వారా ఏటా లక్షలాది మందికి సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. అనంతరం విశ్వనాథ్‌ను సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా 108 మేనేజర్ ఎస్.మన్మథనాయుడు, 104 జిల్లా మేనేజర్ పి.దుర్గాప్రసాద్, 108 ఫ్లీట్ మేనేజర్ భాస్కరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.